

జర్నలిస్టులు సిఆర్ నాయుడు, పరంధామయ్య మృతి



రంగయ్య నాయుడు, పరంధామయ్య (ఫైల్ ఫోటోలు)

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: సీనియర్ జర్నలిస్ట్ సి.ఆర్.నాయుడిగా అందరికీ తెలిసిన చెరుకూరి రంగయ్య నాయుడు(81) హైదరాబాదులోని ఆయన నివాసం వద్ద బుధవారం ఉదయం మృతి చెందారు. వయసు తాలూకు ఆరోగ్య సమస్యలతో ఆయన కొద్దిరోజులుగా బాధపడుతున్నారు. ఐదు దశాబ్దాలకు పైగా ఆయన జర్నలిజంలో ఉన్నారు. ఆయనకు పలువురు నివాళులర్పించారు. తిరుపతికి చెందిన మరో సీనియర్ జర్నలిస్టు పరంధామయ్య తిరుపతిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. ఆయన మృతదేహానికి పలువురు ప్రముఖులు, జర్నలిస్టులు నివాళులర్పించారు. తిరుపతికి చెందిన సీనియర్ జర్నలిస్టులు మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.గోపి, జిల్లా అధ్యక్షులు శ్రీధర్ ఒక ప్రక్రంలో సంతాపం తెలియజేశారు.

ప్రమాదం జరిగేవరకు వేచి చూస్తారా?

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీవారికి పరమ భక్తుడిగా పేరుగాంచిన శ్రీ స్వామి హథీరాం బావాజీ మఠం భవనం కాలానుగుణంగా దెబ్బతిన్న నేపథ్యంలో, ఎండోమెంట్ కమిషనర్ ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న భవనాన్ని కూల్చి పునర్నిర్మాణం చేయాలని ఉత్తర్వులిచ్చినా.. వాటిపై రాజకీయ నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రమాదం జరిగితే గాని అధికార యంత్రాంగం స్పందించేట్లు లేదని, కాలయాపన చేస్తున్న దాన్నిబట్టి స్పష్టంగా అర్థం అవుతుంది.

- ➤ జోరువానలతో పటిష్టత కోల్పోతున్న మఠం మండువా భవనం
- ➤ ఎండోమెంట్ కమిషనర్ ఉత్తర్వులపై కమ్మేసిన రాజకీయ నీలినీడలు
- ➤ పరిస్థితి ఇలానే కొనసాగితే కూటమి ప్రభుత్వానికి నిందలు తప్పవు

వర్షాలకు క్రిందికి ఒరుగుతున్న సపోర్టర్



శతాబ్ద కాలానికి పైన చరిత్ర కలిగిన తిరుపతి గాంధీరోడ్డులోని శ్రీ స్వామి హథీరాంజీ మఠం మండువా భవనం ప్రమాదకర పరిస్థితికి చేరిందని కళ్ళకు కనిపిస్తున్నా, అత్యంత ప్రామాణికంగా భావించే తిరుపతి ఐఐటి నివేదికను సమర్పించినా.. కూల్చివేతకు సంబంధించిన ప్రతి అడుగును రాజకీయంగా అడ్డుకుంటున్నారనే విమర్శలున్నాయి. స్వయంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మఠం భవనాన్ని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య, మఠం పరిపాలనాధికారి బాపిరెడ్డి, మహంతు ఓం ప్రకాష్ దాస్, ఇతర శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. తిరుపతి ఐఐటి ఇచ్చిన నివేదిక ప్రకారం మఠం భవనం మండువా పరిధిలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో మాత్రమే పునర్నిర్మాణానికి అవకాశాలున్నాయని, మిగిలిన కొన్నిచోట్ల పూర్తిగా నిర్మూలించి నిర్మాణాలు చేపట్టాలని పేర్కొన్నారు. అయితే ఈ నివేదికపై మాకు అభ్యంతరాలు ఉన్నాయని, కలెక్టర్ పరిశీలన తర్వాత తదుపరి నిర్ణయం తీసుకోవాలంటూ దుకాణదారులు రాజకీయ నాయకులను వెంటబెట్టుకొని, వారి ఒత్తిళ్ళతో టెండర్ ప్రక్రియ ముగిసినప్పటికీ ప్రమాదకర మండువా ప్రాంత భవనాన్ని కూల్చేందుకు ఒప్పుకోలేదు. ఈ పరిస్థితుల్లో మరొకసారి పరిశీలించి, ప్రభుత్వానికి నివేదించిన పిమ్మట తదుపరి నిర్ణయం తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఆగస్టు 23 2025న తన పర్యటన అనంతరం ప్రకటించి వెళ్లారు.

అటు తర్వాత.. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ విజయవాడలోని స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ వారిని పిలిపించి మఠం మండువా వాస్తవ పరిస్థితులను పరిశీలించి తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దాదాపు ఒకటిన్నర రోజు ఇందుకు సంబంధించిన పటిష్టత అంచనా వేయడం, ఆ నివేదికను నేరుగా జిల్లా కలెక్టర్‌కు ఆర్కిటెక్చర్ వారు సమర్పించడం జరిగింది. తదుపరి కలెక్టర్ నుండి కూల్చివేతకు సంబంధించి ఎటువంటి ఉత్తర్వులు వెలువడ లేదు.

మఠం భవనాలపై తుపాన్ ప్రభావం

మంఠం భవనాలు మొంథా తుఫానుతో పూర్తిగా నానిపోయి ప్రమాదక స్థాయికి చేరుకున్నాయి. తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్, జిల్లా ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, పోలీసు అధికారులతో కలిసి మఠం భవనం కింది భాగంలో ఉన్న దుకాణాలను మూయించి, మఠం భవనం నుండి 5 అడుగుల దూరంగా గాంధీ రోడ్డులో బ్యారికేడ్లను ఏర్పాటు చేయించారు. ప్రమాదకరంగా ఉన్న పరిస్థితిని కూటమి ప్రభుత్వం సరైన సమయంలో అర్థం చేసుకుని ఎటువంటి ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగకుండా సత్వరమే చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఏమాత్రం నిర్లక్ష్యం చేసిన కూటమి ప్రభుత్వానికి నింద మోయక తప్పే పరిస్థితి లేదని అంటున్నారు. తుఫాను కారణంగా గాంధీరోడ్డులోని మఠం ఉత్తర భాగంలో ఇది వరకే కొంత భాగం దెబ్బతిన్న ప్రాంతంలో భవనం కింద నీళ్ల ఊరి క్రిందికి కారుతున్న పరిస్థితిని బుధవారం



ప్రమాదకరంగా మారిన మఠం భవనం



ఆగస్టు 23న మఠంలో బంజారా సంఘాల నాయకులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ (ఫైల్ ఫోటో)

ప్రజలందరూ గమనించిన విషయం. గాంధీరోడ్డు మార్గం నుండి మఠం లోపలికి పోకుండా ప్రధాన ద్వారాన్ని అధికారులు మూత వేయించారు.

ఎండోమెంట్ కమిషనర్ ఉత్తర్వులకు..

రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ మఠం భవనం పరిస్థితిని ముందుగానే గమనించి ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న మఠం ప్రాంగణం లోని మండువాను తొలగించాలని ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఉత్తర్వులు జారీ చేశారు. ఆనాటి నుండి ఈ ఉత్తర్వులపై రాజకీయ నీలి నీడలు కమ్ముకొని నేటి వరకు ఈ ఉత్తర్వుల ఊసు ఎత్తే వారే లేకపోయారు. రాజకీయ జోక్యాలు అధికం కావడంతో మఠం పరిపాలన అధికారి బాపిరెడ్డి సైతం ఎటువంటి నిర్ణయం తీసుకోలేక కలెక్టర్ సూచనల కోసం ఎదురుచూస్తున్నారు. ఏదేని దుర్ఘటన జరగకముందే నిర్ణయం తీసుకొని అమలు పరిస్తే దుకాణదారుల డిమాండ్లతో పాటుగా, పెను ప్రమాదాన్ని కూడా తప్పించినట్లు అవుతుంది. మరి అధికారులు, పాలకులు మఠం భవనంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి.

తిరుపతిలోకి 'నగరి'..?

- గూడూరు నెల్లూరుకేనా..!
- త్వరలోనే అధికారిక ప్రకటన
- పుంగనూరు మదనపల్లికే..!
- ఫలించిన ప్రజల అభ్యర్థన...

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: వైసీపీ ప్రభుత్వం చేసిన అశాస్త్రీయ జిల్లాల విభజన సమస్యను సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం మార్పులు చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. జిల్లాల పునర్విభజనపై రెండు రోజుల పాటు మంత్రివర్గంలో కసరత్తు నడిచింది. ఏడుగురితో కూడిన మంత్రి వర్గ ఉప సంఘం రెవిన్యూ డివిజన్‌లో మార్పులు, కొత్త రెవిన్యూ డివిజన్లు, కొత్త జిల్లాల ప్రతిపాదనలను ప్రజల వద్ద నుంచి స్వీకరించి క్యాబినెట్ ముందు ఉంచారు. మంగళవారం మంత్రివర్గ ఉప సంఘం ఇచ్చిన నివేదికపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ సుదీర్ఘంగా చర్చించారు. మార్కాపురం మదనపల్లిలను కొత్త జిల్లాలుగా ఏర్పాటు చేయబోతున్నట్లు తెలుస్తోంది. చిత్తూరులో ఉన్న పుంగనూరు నియోజకవర్గం కొత్తగా ఏర్పడే మదనపల్లి జిల్లాలో కలవనుంది. చిత్తూరు జిల్లాలో కలిసి ఉన్న నగరి నియోజక వర్గం తిరుపతికి సమీపంలో ఉన్న తిరుపతి జిల్లాలో కలపాలని వైసీపీ మాజీ మంత్రి ఆర్కే రోజా, ప్రస్తుత నగరి టిడిపి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ తీవ్రంగా ప్రయత్నించారు. నియోజక వర్గంలోని ప్రజలందరూ ఎక్కువ శాతం మంది తిరుపతిలో కలపాలని మంత్రివర్గ ఉప సంఘానికి విన్నవించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే నగరి నియోజకవర్గంలోని వడమాలపేట, పుత్తూరు మండలాలు తిరుపతిలో కలిసున్నాయి. ప్రస్తుతం మంత్రివర్గం ఉప సంఘం సిఫార్సుల మేరకు నగరి రెవిన్యూ డివిజన్లో గంగాధర్ నెల్లూరు నియోజకవర్గానికి చెందిన మండలాలు కూడా తిరుపతి జిల్లాలో కలిసే అవకాశం ఉంది. నగరి నియోజకవర్గంలోని నగరి, విజయపురం, నిండ్ర మండలాలు తిరుపతి జిల్లాల్లో కలవబో తున్నాయి. అలాగే జీడి నెల్లూరు నియోజక వర్గంలోని కార్వేటినగరం, వెదురుకుప్పం, పాలసముద్రం, ఎస్ఆర్ పురం మండలాలు తిరుపతి జిల్లాలో కలిసే అవకాశం ఎక్కువగా కనిపిస్తున్నాయి. విభజన తర్వాత నెల్లూరు జిల్లాలో నుంచి తిరుపతి జిల్లాలో కలిసిన గూడూరు నియోజకవర్గం మళ్లీ తిరిగి నెల్లూరు జిల్లాలోకి వెళ్లనుంది. గూడూరు, కోట, వాకాడు, చిల్లకూరు, చిట్టమూరు మండలాలు గూడూరు నియోజకవర్గంలో కలిసి ఉన్నాయి. పుంగనూరు నియోజకవర్గం లోని పుంగనూరు, చౌడేపల్లి, సోమల, సదుం, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలు మదనపల్లి జిల్లాలో కలవనున్నాయి. నగిరి, జీడి నెల్లూరు, పుంగనూరు నియోజకవర్గంలోని13 మండలాలు చిత్తూరు జిల్లాలో నుంచి తిరుపతి, మదనపల్లి జిల్లాలో కలవనున్నాయి.. ఇదేగాని జరిగితే రాష్ట్రంలోనే అతి చిన్న జిల్లా 18 మండలాలతో చిత్తూరు జిల్లాగా ఉండనుంది. తిరుపతి జిల్లా విస్తీర్ణం రాష్ట్రంలోనే పెద్దదిగా అవతరించనుంది.

నష్ట పరిహార గణన చర్యలు చేపట్టాలి

- ■ పునరావాసా కేంద్రాలలో ఉన్న వారికి నిత్యావసర సరుకులు అందేలా చూడాలి
- ■ శానిటేషన్, స్వచ్ఛమైన తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలి:కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జిల్లాలో తుపాన్ నష్ట పరిహార గణన చర్యలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. బుదవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఆర్‌డిఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహశీల్దార్లు, సంబంధిత శాఖ లైన్ డిపార్ట్మెంట్ అధికారంతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇతర తుఫాన్ ప్రభావిత జిల్లాల కన్నా తిరుపతి జిల్లాలో తుపాన్ ప్రభావం చాలా తక్కువ శాతం నష్టం నమోదయిందని జిల్లాలో యుద్ధ ప్రాతిపదికను తుఫాన్ నష్ట పరిహార గణన చర్యలు చేపట్టాలని తెలిపారు. తుపాన్ ప్రభావం వలన బురద, చెత్త పేరుకు పోయిన ప్రాంతాల్లో శానిటేషన్ చేపట్టేలా వెనువెంటనే చర్యలు తీసుకోవాలని తెలిపారు. వాటర్ ట్యాంక్‌లు శుభ్రం చేయడం పాటు క్లోరినేషన్ చేపట్టాలని తెలిపారు. అవసరమైన చోట వాటర్ ట్యాంక్‌లు ద్వారా తాగు నీరు అందేలా చూడాలన్నారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో ప్రతి చోట కూడా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని, వారికి మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక జాగ్రత్తలో భాగంగా ఫీవర్ సర్వే నిర్వహించాలన్నారు. నీరు నిల్వ ఉన్న చోట లార్వా ఉత్పత్తి కాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. చెరువులు, కాజ్వేల వద్ద వరద ప్రవాహం తగ్గేవరకు ఇరిగేషన్ శాఖ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో అన్ని ట్యాంకులు నిండుకుండలా ఉన్నాయని, రబీ సీజన్ అవసరం మేరకు నీటిని నిలువ చేసుకోవాలని తెలిపారు. తుఫాన్ వలన గుంతలు ఏర్పడిన చోట, ఆర్ అండ్ బి అధికారులు నేషనల్ హైవే వాళ్ళతో సమన్వయం చేసుకొని రోడ్లు నిర్మాణం పూర్తి చేయాలని తెలిపారు. రోడ్లు మరమ్మతులను ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు. విద్యుత్తు పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న బాధితులకు నిత్యవసర సరుకులు, ప్రతి కుటుంబానికి 3 వేల రూపాయలు అందించేలా సంబంధిత అధికారులు త్వరత గతిన వారికి అందేలా చూడాలన్నారు. నిత్యవసర సరుకులలో భాగంగా బాధితులకు 25 కేజీల బియ్యం, ఒక కేజీ కందిపప్పు, లీటర్ వంటనూనె, కేజీ ఉల్లిగడ్డలు, కేజీ ఉల్లిపాయలు, కేజీ చక్కర అందించడంతోపాటు పునరావాస కేంద్రాల నుంచి వారి నివాసానికి వెళ్లే వారికి ప్రతి కుటుంబానికి 3 వేల రూపాయలు చొప్పున అందేలా చూడాలన్నారు. పంచాయతీరాజ్, మున్సిపాలిటీ శాఖ వారు సమన్వయంతో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. తుఫాన్ నష్ట నివారణ చర్యల్లో సచివాలయం సిబ్బంది తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. వరద ప్రవాహం ఎక్కువ ఉన్న ప్రాంతాలలో బీచ్ లు, చెరువుల దగ్గర ఎవరిని కూడా నాలుగు రోజులు వరకు వెళ్లకుండా రెవెన్యూ శాఖ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ నరసింహులు, తిరుపతి ఆర్ డి ఓ రామ్మోహన్, జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి శేషాచలం రాజు తదితరులు పాల్గొన్నారు.

టీటీడీలో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయండి



టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టిటిడిలో బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు పాలకుంట శ్రీనివాసులు, డాక్టర్ బి.మునీంద్ర నాయక్, వి.రాజ్ కుమార్ టిటిడి ఈఓ అనిల్ కుమార్ సింగాల్‌ను కలసి వినతి పత్రాన్ని అందించారు. టిటిడికి చెందిన కళ్యాణ మండపాలను ప్రైవేట్ వ్యక్తులు కాకుండా టీటీడీని నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎస్సీ ఎస్టీ కాలనీలలో ఉచిత మెడికల్ క్యాంపులను టిటిడి ఆధ్వర్యంలో నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. టిటిడిలో ఔట్సోర్సింగ్ విభాగంలో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించాలని, టీటీడీ షాపింగ్ కాంప్లెక్స్‌లలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రకారం షాపులను కేటాయించాలని కోరారు. అలానే ఎస్సీ ఎస్టీ గ్రామాల్లో దళిత, గిరిజన గోవిందం ఏర్పాటు చేయాలన్నారు. వినతులపై తగు చర్యలు తీసుకోవాలని జేఈవో వీరబ్రహ్మంను ఈవో ఆదేశించినట్లుగా చెప్పారు.

ఎస్వీయులో ప్రత్యేక ఫీజు సీట్లకు అడ్మిషన్లు

ప్రజాశక్తి- క్యాంపస్ : యస్వీయు ఇంజనీరింగ్‌లో యం.టెక్ కోర్స్(కెమికల్, సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రికల్, కమ్యూనికేషన్స్, మెకానికల్, ఇంజనీరింగ్), యస్వీయూ ఫార్మసీ కళాశాలలో యం.ఫార్మసీ, బి.ఫార్మసీ కోర్సులలో ప్రత్యేక ఫీజు చెల్లింపు సీట్లలో, చేరదలచిన విద్యార్థులు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్లను సంప్రదించవలసిందిగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేటగిరీ క్రింద యం.టెక్ చేరడానికి గేట్– 2025 మొదటి ప్రాధాన్యత,, ఏ.పి పి.జి ఈసెట్ –2025 రెండవ ప్రాధాన్యత, కేవలం బి.టెక్ వారికి చివరి ప్రాధాన్యత అడ్మిషన్లలో ఇవ్వబడుతుందని వారు చెప్పారు. అలాగే యం. ఫార్మసీ కోర్సుల్లో చేరడానికి జీ ప్యాట్–2025 వారికి మొదటి ప్రాధాన్యత, ఏ.పీ పి.జి ఈసెట్ –2025 రాసిన వారికి రెండవ ప్రాధాన్యత, కేవలం బి. ఫార్మసీ ఉన్నవారికి చివరి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. అదేవిధంగా బి.ఫార్మసీలో చేరడానికి ఈ. ఏ.పి. సెట్ –2025 రాసిన వారికి మొదటి ప్రాధాన్యత,కేవలం ఇంటర్మీడియట్ (ఎంపీసీ, బైపీసీ) చదివిన వారికి చివరి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. యం.టెక్ కోర్స్‌కు ప్రత్యేక ఫీజు సంవత్సరానికి 1,45,170 రూపాయలు యం. ఫార్మసీ కోర్సుకు ప్రత్యేక ఫీజు సంవత్సరానికి 1,53,940రూపాయలు, బి.ఫార్మసీ కోర్సుకు ప్రత్యేక ఫీజు సంవత్సరానికి 81000రూపాయలు చెల్లించవలసి ఉంటుందని తెలిపారు.

కాలువలు, రోడ్లు బాగు చేయండి : సిపిఎం



ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట మున్సిపాలిటీ వీధులు మురికి నీటితో రోడ్లు జలమయంగా ఉన్నప్పటికీ అధికారులు, రాజకీయ నాయకులు పట్టించుకోవడంలేదని బుధవారం సిపిఎం పార్టీ, అవాజ్, సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంతకాలు సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ శివకవి ముకుంద, సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మమ్మ, మస్తాన్ రెడ్డి మాట్లాడుతూ గతలో పంచాయతీ నిధులతో వేసిన రోడ్లు, కాలువలు అలాగే ఉన్నాయని, ఇప్పుడు మున్సిపాలిటీ అయినప్పటికీ పట్టించుకునే నాధుడే కరువయ్యాడని ఆరోపించారు. ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్నారేకానీ, మున్సిపాలిటీ అభివృద్ధికి ఏమాత్రం వినియోగిచడం లేదని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో సిపిఎం ప్రజాసంఘాలు కలిసి ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించి మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణకి, జిల్లా కలెక్టర్‌కి, మంత్రి లోకేష్‌కి పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సతీష్, అబ్దుల్లా, అవాజ్ కమిటీ నాయకులు హలీం ఖాన్‌లు మాట్లాడుతూ ఎన్నికలప్పుడే ప్రజలు నాయకులకు గుర్తొస్తారని, రోడ్లు, కాలువలు, వీధి దీపాలు వేయిస్తామని హామీలు ఇస్తారని, గెలిచాక ఇవన్నీ మరచి సంపాదనపైనే శ్రద్ధ చూపుతారని ఆరోపించారు.మళ్లీ ఎలక్షన్ రాబోతున్నాయని, ఈ సారి ప్రజలు బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఆవాజ్ సిఐటియు నాయకులు హలీమ్ ఖాన్, ఎస్.కె అబ్దుల్లాలు మాట్లాడుతూ తుఫాన్‌తో ప్రజలు ఇళ్లలో నుండి బయటకు రావడానికి రోడ్లపై గుంతలతో ప్రమాదాలు జరుగుతాయని భయపడ్డారని తెలిపారు. అధికారులు అన్ని వీధులు తిరిగి ఉంటే పరిస్థితులు తెలిసేవన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు శ్యామలమ్మ, విజయమ్మ, హుస్సేనమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేటశ్రీకి సాహితి పురస్కారం

ప్రజాశక్తి - క్యాంపస్ : హైదరాబాదులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం వారి సాహితీ పురస్కారాన్ని ఎస్వియు విశ్రాంత ఆచార్యులు, తెలుగు అకాడమీ మాజీ డైరెక్టర్, కవి, రచయిత ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డి బుధవారం వర్సిటీ ఉప కులపతి చేతుల మీదుగా అందుకున్నారు. 'తిరుపతి కథలు' పుస్తకానికి తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారాన్ని ప్రకటించిన సంగతి మనకు తెలిసిందే. బుధవారం హైదరాబాద్ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళామందిర్‌లో ఈ పురస్కారాన్ని ఆచార్య పేట శ్రీనివాసులు రెడ్డికి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య వెల్దండ నిత్యానందరావు, ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య డి. మునిరత్నం నాయుడు, విశిష్ట అతిథిగా ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం కార్యక్రమ విభాగాధిపతి ఎస్ .రమేష్ సుంకసారి, ఇతర రచయితలు, రచయిత్రులు పాల్గొన్నారు. సాహితీ పురస్కారం బహుమతిగా ఒక్కొక్కరికి రూ. 20,116 లు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆచార్య పేటశ్రీ కి పలువురు విశ్రాంత ఆచార్యులు, ప్రస్తుత ఆచార్యులు, వర్సిటీ ఉన్నతాధికారులు, పరిశోధకులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

పక్కా ఇళ్లు ఇప్పిస్తాం : ఎమ్మెల్యే బొజ్జల



గిరిజనులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

ప్రజాశక్తి-ఏర్పేడు, శ్రీకాళహస్తి: తుపాన్ ప్రభావం వల్ల ఇళ్ళు కూలిపోయిన నిరాశ్రయులకు పక్కా ఇల్లు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఏర్పేడు మండలం, నచ్చనేరి గిరిజన కాలనీలో తుఫాన్ వలన పలువురి ఇళ్ళు కూలిపోవడంతో నిరాశ్రయులయ్యారు. ఈ నేపథ్యంలో దుర్గిపేరి ప్రాథమిక పాఠశాలలో పునరావసం పొందుతున్న 25 గిరిజన కుటుంబాలను బుధవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి నిత్యావసరాలు అందజేశారు. అనంతరం శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయంలో పలు శాఖల అధికారులతో సమావేశమై తుఫాను నష్టాన్ని అంచనా వేయాల్సిందిగా ఆదేశించారు. పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, టీడీపీ నేతలు కన్నలి ప్రతాప్ రెడ్డి, విజయ్ కుమార్ నాయుడు, చెంచయ్య నాయుడు, ఎమ్మార్వో భార్గవి, ఎంపీడీవో సౌభాగ్యమ్మ, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, మండల అధ్యక్షులు పేరం నాగరాజు నాయుడు, ధనంజయ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంటలను పరిశీలించిన కలెక్టర్



అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల పరిధిలోని కారణమెట్ట గ్రామపంచాయతీలో బుధవారం తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ నీటి మునిగిన వరిపంట పొలాలను పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో కిరణ్మయి, తహశీల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో వెంకటరత్నమ్మ, వ్యవసాయ అధికారి షణ్ముగం, సబ్ ఇన్స్పెక్టర్ హరిప్రసాద్‌లు ఉన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీట మునిగిన పంట పొలాలను అంచనా వేసి కలెక్టర్ కార్యాలయానికి పంపించాలని, పంట పొలాలలో నీరును త్వరగా బయటికి వెళ్ళేటట్లు అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నష్టపోయిన రైతులకు 80% సబ్సిడీతో విత్తనాలు సరఫరా చేయాలని తెలియజేశారు. రైతు భరోసా కేంద్రంలో యూరియా చేరిందా లేదాని వ్యవసాయాధికారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఎంపీటీసీ మనోహర్ నాయుడు, తెలుగుదేశం ఐటిటి మండల అధ్యక్షుడు రమేష్, ముని చంద్రారెడ్డి, రెవిన్యూ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టండి



తిరుపతిలో వివిధ కాలనీల్లో కాలువలను పరిశీలించిన కమిషనర్ మౌర్య

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: వర్షాల వలన నగరంలోని ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులు ఆదేశించారు. బుధవారం ఉదయం నగరంలోని స్కావేంజర్స్ కాలనీ, అబ్బన్న కాలనీ, మారుతినగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. తుఫాన్ వలన గుంతలు పడ్డ రోడ్లు, మురుగునీటి కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాల వలన అక్కడక్కడా నిలబడ్డ వర్షపు నీటి వలన అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. కాబట్టి ఎక్కడ వర్షపునీరు, చెత్త లేకుండా శుభ్రం చేయాలని తెలిపారు. వర్షపు నీరు ఆగిన్న ప్రాంతాల్లో మలాథిన్ పిచికారీ చేయాలని, ఆయిల్ బాల్స్ వేసి దోమల లార్వా వృద్ధి చెందకుండా చూడాలని తెలిపారు. శుభ్రం చేరిన ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లాలని తెలిపారు. దోమలు వృద్ధి చెందకుండా అన్ని వార్డుల్లో ప్రతిరోజూ పాగింగ్ చేయాలని అధికారులకు సూచించారు. వర్షం వలన పాడైనా రోడ్లు, మురుగునీటి కాలువల ను మరమ్మత్తు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట 33 వ వార్డు కార్పొరేటర్ దూది కుమారి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, ఏసిపి మూర్తి, డి.ఈ లు రాజు, శిల్ప, సర్వేయర్ కోటేశ్వరరావు, శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

చంద్రమౌళీశ్వర్ రెడ్డిపై సస్పెన్షన్ ఎత్తివేత



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసి, సస్పెన్షకు గురైన చంద్రమౌళీశ్వర్ రెడ్డి పై రాష్ట్ర ప్రభుత్వం సస్పెన్షన్ ఎత్తివేసింది. బుధవారం రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ విజయానంద్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ కార్పొరేషన్ పూర్వపు డిప్యూటీ కమిషనర్ గా పనిచేసిన చంద్రమౌళీశ్వర రెడ్డి తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో ఓటర్ల జాబితా చేర్పులో 35వేల దొంగ ఓటర్లు వైసీపీ పార్టీ వారు సృష్టించడానికి కారకులయ్యారని ఈయనపై అప్పట్లో అభియోగం రావడంతో 2024 ఫిబ్రవరిలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చంద్రమౌళీశ్వర రెడ్డిని సస్పెండ్ చేయడం జరిగింది. కూటమి పర్వతం అధికారంలోకి రావడంతో చంద్రమౌళీశ్వర రెడ్డిపై సస్పెన్షన్ కొనసాగుతూ వచ్చింది. 17 నెలల తర్వాత ఆయనపై సస్పెన్షన్ తాత్కాలికంగా ఎత్తివేసింది. ఆయనకు నాన్ క్యాడర్ కలిగిన పోస్టింగ్ ఇవ్వాలని ఉత్తర్వులు జారీ ఆయ్యాయి. తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల దొంగ ఓట్ల విచారణ కొనసాగుతూనే ఉంది. గతంలో ఇక్కడ కమిషనర్‌గా పనిచేసి కలెక్టర్గా వెళ్ళిన గిరీషాను కూడా సస్పెండ్ చేయడం జరిగింది. తర్వాత కూటమి ప్రభుత్వం అధికంలో రావడంతో అప్పటి రాయచోటి కలెక్టర్ గిరిషాపై విచారణ అనంతరం ఆయనపై ఉన్న సస్పెన్షన్ ఎత్తివేసిన విషయం తెలిసిందే.

అందుబాటులో యూరియా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్(తొట్టంబేడు): మండలంలోని తంగేళ్లపాలెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ సొసైటీలో రబీ సీజన్‌కు కావలసిన యూరియా అందుబాటులో ఉందని ఆ సొసైటీ అధ్యక్షులు భీమాల భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూరియా కావాల్సిన రైతులు వ్యవసాయ శాఖ జారీ చేసిన కార్డును తీసుకుని వస్తే ఎకరాకు 3 బస్తాలు చొప్పున 3 విడతలుగా ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘపు డైరెక్టర్లు జీ భత్తయ్య, పి ధనంజయలు, సీఈవో చిరంజీవి రెడ్డి పలువురు రైతులు పాల్గొన్నారు.

తుపాను దెబ్బకు రోడ్లు గుంతలమయం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలో గత రాత్రి తుఫాన్ తీరం దాటడంతో వర్షాలు పూర్తిగా తగ్గు ముఖం పట్టాయి. ఈ వర్షాలతో పలు ప్రాంతాల్లో రోడ్లు గుంతల మయ మయ్యాయి. పంబలేరు కాలువ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలను నిలిపివేశారు. తుఫాన్ ప్రభావం డివిజన్‌పై పెద్దగా లేకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

తుపాను బాధితులను ఆదుకోండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మొంథా తుపాను ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న లోతట్టు ప్రాంత ప్రజలను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని అబ్బాభట్లపల్లి అరుంధతి వాడ, ముళ్ళపూడి, పోలి గిరిజన కాలనీల్లో పర్యటించారు. ప్రజల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. అనంతరం బాధితులకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. పంట, ఆస్తి నష్టాన్ని గుర్తించి ఆదుకోవాలన్నారు. గత 15 రోజుల నుండి కురుస్తున్న వర్షాలు కారణంగా కలుషితమైన నీరు తాగి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని, వెంటనే గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని కోరారు. ఈ పర్యటనలో బిర్రి హేమభూషణ్ రెడ్డి, శ్రీకాళహస్తి మండల అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, వైసీపీ రైతు విభాగం ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వయ్యాల మనోహర్ రెడ్డి, వైఎస్ఆర్సీపీ వాలంటీర్ విభాగం అధ్యక్షుడు రంగినేని చెంచయ్య నాయుడు, రామాపురం సర్పంచ్ వెడం బాలి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1న చలో హైదరాబాద్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్ గవాయిపై, అడ్వకేట్ రాకేష్ కిషోర్ కాలి బూటు వేయడాన్ని నిరసిస్తూ నవంబర్ 1న చలో హైదరాబాద్ దళితుల ఆత్మగౌరవ మహా ర్యాలీ ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ గూడూరు ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఎమ్మార్పీఎస్ నాయకులు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ తిరుపతి జిల్లా ఇంచార్జ్ వర్ల దేవదాస్ మాదిగ, నియోజకవర్గ ఇన్చార్జ్ గొల్లపల్లి సిసింద్రి మాదిగలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు నవంబర్ 1 న చలో హైదరాబాద్ దళితుల ఆత్మగౌరవ మహా ర్యాలీ ప్రదర్శన కార్యక్రం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గవాయి మీద దాడికి పాల్పడిన రాకేష్ కిషోర్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, చిలకూరి మండల ఇంచార్జ్ మల్లికార్జున, గూడూరు పట్టణ అధ్యక్షులు సాయినాథ్, మండల నాయకులు కిరణ్, పెంచలయ్య, గురవయ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఒరిగింది సున్నా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కూటమి పాలనలో రైతులకు ఒరిగింది సున్నా అని, కార్పొరేట్లకు చేకూరింది మేలని మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్ విమర్శించారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో బుధవారం చింతా మోహన్ మీడియా సమావేశం నిర్వహించి కూటమి పాలనపై నిప్పులు చెరిగారు. రైతులు అప్పుల్లో ఉన్నారు.. ఆత్మహత్యలకు రెడీగా ఉన్నారని వాపోయారు. వరి పంట చేతికి వచ్చే సమయంలో తుపాను రావడం వల్ల నష్టపోతున్నారన్నారు. పరిశ్రమలకు ఇచ్చిన సదుపాయాలు, రైతులకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అదానికి భూములు ఇస్తారు. విమానాశ్రయాలు ఇస్తారు. సీ-పోర్టులు ఇస్తారు..మరి రైతులకు ఏమి ఇచ్చారని ప్రశ్నించారు. కార్పొరేట్లకు రూ.14.50 లక్షల కోట్ల రూపాయలు బ్యాంకులు రుణమాఫీ చేశాయని మండిపడ్డారు. రైతుకు ఒక్క రూపాయి అయినా మాఫీ చేసిన దాఖలాలు లేవన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 20 వేల ఎకరాల భూ మాఫియా జరిగిందని, ముక్కంటి ఆలయంలో దోపిడీపై ప్రభుత్వం విచారణ జరపాలన్నారు. రైతులకు న్యాయం చేసేది కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు డాక్టర్ బత్తయ్య నాయుడు, నరేంద్ర నాయుడు, సమీవుల్లా, కాలి రవి, జనార్దన్ రెడ్డి, శివయ్య, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

షరీఫ్ కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి - కేవీబి పురం: మూడు రోజుల క్రితం తెలుగు గంగ కాలువలో బాలుడిని కాపాడబోయి, బాలుడితోపాటు గల్లంతయిన వరదయ్యపాలెంకు చెందిన షరీఫ్ మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. విషయం తెలుసుకున్న మైనార్టీ సెల్ స్టేట్ జాయింట్ సెక్రెటరీ జాకీర్ వెంటనే స్పందించి షరీఫ్ కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ షరీఫ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

అండగా ఉంటాం : సత్యవేడు టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ శంకర్ రెడ్డి

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: షరీఫ్ కుటుంబాన్ని టీడీపీ అన్ని విధాల ఆదుకుంటుందని సత్యవేడు నియోజకవర్గ ఇంచార్జ్ శంకర్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం షరీఫ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ కుటుంబానికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఏపీఎం, టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తలకోన అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - యర్రావారిపాలెం: శ్రీ తలకోన సిద్ధేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి పాలకమండలి మరింత కృషి చేస్తుందని ఆలయ చైర్మన్ సోమనాథ్ రెడ్డి తెలిపారు. తలకోనలో బుధవారం నిర్వహించిన పాలకమండలి సమావేశంలో ఆయన మాట్లాడు తూ కార్తీక మాసంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. లడ్డు ప్రసాదాలు తయారు చేసే అమ్మకు సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని ఈవో రవీంద్ర రాజు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పాలకమండలి సభ్యులు సిరువేలు రమేష్, రాజన్న, చలపతి, శశికళ, రాజేశ్వరి, ఇందిరా, చెంగమ్మ, ఈశ్వరయ్య, ఎక్స్ అఫిషియో సభ్యులు సత్య ప్రసాద్ శర్మ పాల్గొన్నారు.

త్రైక్వాండో, క్రికెట్ పోటీలలో హేమంత్ సాయి ప్రతిభ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు శ్రీ వేద జూనియర్ కళాశాలకి చెందిన విద్యార్థి హేమంత్ సాయి రాష్ట్ర స్థాయి త్రైక్వాండో పోటీలలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. క్రికెట్ అండర్-19 జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. నవంబర్‌లో రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా కాలేజ్ కరస్పాండెంట్ బాలసరస్వతి, డైరెక్టర్ వేదవ్యాస్ తదితరులు హేమంత్ సాయిని అభినందించారు.

రాయలచెరువు ముంపు రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలంలోని రాయలచెరువు ముంపు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని చంద్రగిరి నియోజక వర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తుపాన్ కారణంగా రాయలచెరువును స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలచెరువులో పంటలు ముంపుకు గురైన ప్రతి రైతుకు ఎకరాకు లక్ష రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే పులివర్తి నాని రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. 2021 భారీ వర్షాల సమయంలో తన తండ్రి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పేద ప్రజలకు నిత్యావసర వస్తువులు అందజేసి ఆదుకున్నారని గుర్తు చేశారు.

వ్యవసాయానికి సిద్ధమైన మున్సిపాలిటీ రోడ్డు

- మున్సిపాలిటీ అధికారుల బాధ్యతారాహిత్యం
- ఇళ్లలోంచి బయటకు రాలేని పరిస్థితుల్లో ప్రజలు
- ప్రశ్నించాల్సి ప్రతిపక్ష నాయకులు ఎక్కడ..?



ప్రజాశక్తి - నాయుడుపేట: నిత్యం పట్టణ ప్రజలతో భారీ అతి భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు కార్లతో రోజు వందలాది వాహనాలతో రద్దీగా ఉండే మునిసిపాలిటీ రోడ్డు ఇప్పుడు వ్యవసాయానికి సిద్ధమైందని స్థానికులు చలోక్తులు విసురుతున్నారు. తిరుపతి జిల్లా, నాయుడుపేట మున్సిపాలిటీ లో ప్రధాన రహదారి అయిన పిచ్చిరెడ్డి తోపు, పాత శ్రీ కాళహస్తి బైపాస్ రోడ్డు ఇప్పుడు వ్యవసాయానికి సిద్ధమైన భూమిలా అడుసుతో దర్శనమిస్తోంది. ఆర్ అండ్ బి శాఖకు చెందిన పట్టణంలోని ఈ రోడ్డు కొన్ని రోజుల క్రితం వరకు నాయుడుపేట మండలం, మేనకూరులోని సెజ్ కు వెళ్లే భారీ వాహనాల రద్దీతో గుంతలు పడి ప్రజల రాకపోకలకు కొంత ఇబ్బందికరంగా ఉండేది. ప్రజల ఇబ్బందులను గుర్తించిన మున్సిపల్ శాఖ వారు ఈ గుంతలు పూడ్చి ప్రజలకు కొంత ఊరట కలిగించేందుకు పది లక్షలు మున్సిపాలిటీ నిధులతో పనులు ప్రారంభించి ఒక కాంట్రాక్టర్కు బాధ్యతలు అప్పగించారు. ఆ బాధ్యతలు చేజిక్కుంచుకున్న సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించి ఈ రోడ్డును అతి తక్కువ ధరకు లభించే బూడిదని తీసుకొచ్చి పోసి అంతంత మాత్రంగా ఉన్న రోడ్డును పూర్తిగా నిరుపయోగంగా మార్చి ప్రజలకు ఏమాత్రం పనికిరాకుండా చేశాడు. ప్రజాధనం ఇంత వృధా అవుతున్న మునిసిపాలిటీ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ అధికారులు నోరు మెదపడం లేదు. మునిసిపాలిటీ ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ ఏఈ, డిఈ ఉప్పు శ్రీనివాసరావులను దీనిపై వివరణ కోరిన వారు ఏమాత్రం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం గమనార్హం. ప్రజాధనం ఇలా వృధా అవుతుంటే అడ్డుకోవలసిన ఏ ఈ, డిఈ లు తమకేమీ పట్టనట్టు ఇది అసలు సమస్య కానట్టు దీనితో వారికి ఎటువంటి సంబంధం లేనట్టు వివరిస్తున్నారు. ఈ పనులను పర్యవేక్షించాల్సిన అధికారి ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ డి ఈ నిర్లక్ష్య వైఖరిపై ఇప్పటికే పలు ఆరోపణలున్నాయి. ఆయన సరిగా కార్యాలయానికి రాడని, ఒకవేళ వచ్చిన ఎంత సేపు కార్యాలయంలో ఉంటాడో ఎవ్వరికీ తెలియదని, ఏ రోజు ఆయన ప్రజలకు అందుబాటులో ఉన్నది లేదని ఇలా అనేక ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. ఈ పనులకు సంబంధించిన వివరాలు కోసం పలుమార్లు ఏఈని సంప్రదించినప్పటికీ ఆయన నిర్లక్ష్యం వహించడంపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఈ రోడ్డు పనుల నిమిత్తం మునిసిపాలిటీలోని ప్రజాధనమే గాక దాదాపుగా 15 లక్షల రూపాయలు పరిశ్రమల నుంచి వసూళ్లు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రోడ్డు పట్టణ ప్రజలకంటే కూడా పరిశ్రమలకు అతి ముఖ్యమైనది కాబట్టి ఈ ఆరోపణలలో నిజం లేకపోలేదన్నది వాస్తవం. దాదాపుగా 25 లక్షల రూపాయలు వెచ్చించి ప్రజలకు ఏమాత్రం ఉపయోగం లేని రోడ్డును నిర్మించడంతో అధికారులు తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్‌ను సంతోష పెట్టడానికి, అధికారుల జేబులు నింపుకోవడానికి ప్రజల జీవితాలను పణంగా పెడతారా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు పనులు ప్రారంభించక ముందు ఎంతో కొంత ఇబ్బంది పడుతూ తిరుగుతున్న ప్రజలు ఇప్పుడు పూర్తిగా వినియోగించుకోలేక పోతున్నామని బాధ పడుతున్నారు. ఇప్పుడు ఆ రోడ్లో భారీ వాహనాలు తప్ప కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ప్రజలు తిరగలేని పరిస్థితులు నెలకొన్నాయి. సాక్షాత్తు సూళ్లూరుపేట ఎమ్మెల్యే



ఇంటికి అతి సమీపంలో ఉన్న ఈ రోడ్డు ఇంత దుర్భరంగా మారినా నాయకులు ఏ ఒక్కరు నోరు మెదపకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. అవసరంలేని వాటికి కూటమి పాలనపై అనవసర రాద్ధాంతం చేసే ప్రతిపక్ష నాయకులు ప్రజాధనం ఇలా వృధా అయిపోతూ, ప్రజలు ఇంతటి విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటుంటే ఎందుకు కనిపించడం లేదని, ప్రతిపక్ష నాయకులు ఇప్పుడు ఎక్కడికి పోయారంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పై అధికారులు స్పందించి ఇలాంటి అవినీతికి పాల్పడ్డ అధికారులపై చర్యలు చేపట్టి పరిస్థితులు చక్కదిద్దాలని ప్రజలు కోరుకుంటున్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు సాయికుమార్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వై సాయి కుమార్ 24వ తేదీ జరిగిన హ్యాండ్ బాల్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. నవంబర్ 1 తేదీ తెనాలిలో జరుగనున్న రాష్ట్రస్థాయి ఎంపికయినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సాయికుమార్‌ను అభినందించారు.



సాయి కుమార్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

ప్రత్యేక ఆధార్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ, కాటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నెలవాయి జడ్పీ ఉన్నత పాఠశాల్లో సోమవారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ కేంద్రాలను బుధవారం స్థానిక మండల పరిషత్ పరిపాలన అధికారిణి వెంకట రత్నమ్మ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆధార్ నమోదు కార్యక్రమంలో ఆధార్ నమోదు చేసుకోని పిల్లలకు వేలి ముద్రలు నమోదు చేసినట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపట్ల అవగాహన

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తుఫాను ప్రభావంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మండల ప్రజలందరూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం బుచ్చినాయుడు కండ్రిగ మండలం, లక్ష్మీపురం యానాది కాలనీ వాసులకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధిత రైతులకు పరామర్శ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: గత కొద్దీ రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో దెబ్బతిన్న పంట పొలాలను, బొగడలు పడిన చెరువు కట్టలను, కాజువేలను బుధవారం సత్యవేడు టీడీపీ కో ఆర్డినేటర్ శంకర్ రెడ్డి పరిశీలించారు. కుక్కంబాకం పంచాయతీ భైరవారి గుంట తూముకి, బొగడపడి గ్రామం పైకి వస్తున్న నీటి ప్రవాహాన్ని గమనించి సంబంధిత అధికారులకు పునరుద్ధరణ చర్యలు చేపట్టమని ఆదేశించారు. కారణి పంచాయతీలో దెబ్బతిన్న పంట పొలాలను సందర్శించి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరపున తక్షణ సహాయం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.



రైతులతో సత్యవేడు టీడీపీ కోఆర్డినేటర్ శంకర్ రెడ్డి

స్వర్ణముఖిపై వంతెన నిర్మించండి : చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ మండలంలో తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న ప్రాంతాలను చంద్రగిరి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ముందుగా చిగురువాడ వద్దనున్న స్వర్ణముఖి నదిపై కూలిన వంతెనను ఆయన పరిశీలించారు. అనంతరం కుంట్రపాకం పంచాయతీలో పర్యటించిన ఆయన నీట మునిగిన గోపాల్ ఇంటిని పరిశీలించారు. కుంట్రపాకం సమీపంలోని చెరువు, పెద్ద కాలువ నీళ్లు ఆ ఇంటిని చుట్టేయడంతో అందులో నివాసముంటున్న వారు పాముల బెడదతో భయం భయంగా గడుపుతున్నారు. ఆ విషయం తెలుసుకున్న ఆయన స్థానిక సర్పంచ్ శుభ పద్మనాభరెడ్డి, మైనారిటీ నేత కరమల వల్లీలకు ఒక మోటారు సాయంతో ఆ నీటిని బయటకు పంపించేలా చూడాలని సూచించారు. అనంతరం గ్రామంలో పర్యటించిన ఆయన వర్షం తాకిడికి ఇంకా ఎవ్వరికైనా ఇబ్బందులు కలిగాయా..? అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం కూలిన వంతెనకు ప్రత్యామ్నాయంగా తాత్కాలిక వంతెన ఏర్పాటు చేయగా ఆ వంతెనపైనే వాహనాలు అన్నీ వెళుతుండటం, స్వర్ణముఖి నదిలో వరద ఉధృతి పెరుగుతుండటంతో శాశ్వత వంతెనలు నిర్మించాలని డిమాండ్ చేశారు. గత ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలలకే వంతెనలు అన్నీ బాగు చేస్తామని మాట ఇచ్చిన స్థానిక ఎమ్మెల్యే పులివర్తి నాని అధికారంలోకి వచ్చిన రెండేళ్లు గడుస్తున్నా ఇంకా ఎందుకు నిర్మాణ పనులు చేపట్టలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో శాశ్వత వంతెనల నిర్మాణం ఆలస్యమైందని గగ్గోలు పెట్టిన వారంతా అధికారంలోకి రాగానే ఆ వంతెనల నిర్మాణ పనులు ఎందుకు ప్రారంభించలేదో ప్రజలకు చెప్పాలన్నారు. ఈ పర్యటనలో రాష్ట్ర పార్టీ నాయకులు ఉపేంద్రరెడ్డి, జిల్లా బీసీసెల్ అధ్యక్షులు చిన్నియాదవ్, మండల వైస్ ఎంపీపీ విడుదల మాదవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు మునీశ్వరరెడ్డి, చిగురువాడ పంచాయతీ పార్టీ అధ్యక్షులు ముచ్చేలి ధరణీకుమార్‌రెడ్డి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు ముచ్చేలి కిరణ్‌కుమార్ రెడ్డి, తులసీరామిరెడ్డిలతో పాటు కుంట్రపాకం నుంచి సర్పంచ్ శుభ పద్మనాభరెడ్డి, కరమల వల్లీ, ఎంపీటీసీ రెడ్డెయ్య, రఫీ, మురళి, కళావతి, ఎం.లక్ష్మీ, ప్రసాద్‌రెడ్డి, కేశవరెడ్డి, రాజా ప్రభాకర్ రెడ్డి, భరత్, లక్ష్మయ్యలతో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



సర్వ సభ్య సమావేశానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు గైర్హాజరు

ప్రజాశక్తి - చిట్టమూరు: చిట్టమూరు మండలం ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో, వైస్ ఎంపీపీ బద్దిగ వెంకట రమణయ్య అధ్యక్షతన స్త్రీ శక్తి భవనంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రజా ప్రతినిధులు, కొందరు అధికారులు గైర్హాజరయ్యారు. సర్పంచ్లకు సైతం సమాచారం అందలేదని, దీంతో సమావేశంలో పాల్గొనలేకపోయినట్లు తెలిపారు. అయితే సమావేశం మొదలుపెట్టిన కొద్ది సమయానికే అధికారులు, ప్రజా ప్రతినిధులు లేచి వెళ్లిపోయారు. మిగిలిన వారు మాత్రమే ప్రజల సమస్యల మీద చర్చించుకున్నారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ బద్దిగ వెంకటరమణయ్య మాట్లాడుతూ విద్యుత్, నీటిపారుదల, పశు వైద్య శాఖల అధికారులు హాజరుకాలేదని, దీంతో కొన్ని సమస్యలను చర్చించే అవకాశం లేదని తెలిపారు. అనంతరం వర్షాకాలంలో తీసుకోవాల్సి జాగ్రత్తలపై చర్చించారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుపతి జిల్లా, వేమూరు గ్రామంలోని అయ్యప్ప నాయుడు రైతు ప్రకృతి వ్యవసాయ పొలాలను ట్రైనీ ఐఏఎస్ అధికారి సందీప్ రఘువంషి బుధవారం పరిశీలించారు. తక్కువ పెట్టుబడితో పలు రకాల పంటలతో నిరంతరం ఉత్పత్తినిస్తూ రైతుకు నిరంతరం ఆదాయం వచ్చేటువంటి ఏటీఎం మోడల్ జరిగిందిజిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి డిపిఎ షణ్ముగం వివరించారు. ప్రకృతి వ్యవసాయంలోని ఏటీఎం మోడల్‌లో వేసిన ఆకుకూరలు, కూరగాయలు, తీగజాతి పండ్ల మొక్క లను చూపిస్తూ భూమిని తక్కువ దుక్కు, దున్నకుండా పంటలు ఏ విధంగా పండించవచ్చు, భూమిని దున్నకుండా ఉండడం వల్ల 365 రోజులు పచ్చని పంటలతో ఉండడం వల్ల భూమి ఎలా సారవంతమవుతుందో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని చూపిస్తూ వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారి షణ్ముఖం, తిరుపతి రూరల్ సుబ్బారావు, మధు, మహమ్మద్ హసన్, రైతు అయ్యప్ప, మహిళా రైతులు పాల్గొన్నారు.

తుపాను ప్రభావంపై చర్చించిన నేదురుమల్లి

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు, నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి నివాసంలో బుధవారం వైయస్సార్సీపి శ్రేణులతో తుఫాన్ ప్రభావంతో ఇబ్బంది పడిన ప్రజల, రైతుల, పంటల స్థితిగతులపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలను, ప్రజల ఆస్తులను కాపాడవలసిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వం సహాయ చర్యలు తక్షణమే చేపట్టాలని కోరారు. గూడూరు నియోజకవర్గంలో తీర ప్రాంతాలైన వాకాడు, కోట, చిట్టమూరు మండలాలు తుఫాన్ ప్రభావం నుండి కొంత మేరకు తప్పించుకున్నాయని తెలిపారు. చెరువుల, వాగుల కట్టలకు, బ్యారేజ్‌లకు మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను కోరారు. తమ ప్రభుత్వ పాలనలో తుపాను నేపథ్యంలో ఏ ఇబ్బంది లేకుండా చూశామని గుర్తు చేశారు. దేవుడి మాన్యం భూములు వేలం వేసేప్పుడు దళితులను దృష్టిలో పెట్టుకోవాలని, ఈ వేలంతో దేవాలయాలకు కూడా న్యాయం జరగాలని తెలియజేశారు. వాకాడులో ఎండోమెంట్ భూములు వేలంలో చట్టపద్ధత పాటించారా అని ప్రశ్నించారు. వేలం పాటలు నిర్వహించిన ఏసి, ఈవో నిబంధన అనుసరించి నడుచుకోలేదని, ఈ వ్యవహారం న్యాయస్థానంలో విచారణలో ఉందని తెలిపారు. అయినప్పటికీ వేలంపాటలు నిర్వహించారన్నారు. ప్రస్తుతానికి ఈ విషయం ఎక్కువ మాట్లాడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కొడవలూరు దామోదర్ రెడ్డి, వాకాడు ఉప సర్పంచ్ పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి, వాకాడు, కోట, చిట్టమూరు మండల వైసిపి నాయకులు నాయకులు పాల్గొన్నారు.



వైసీపీ నాయకులతో నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

ఎస్టీ కాలనీ వాసులకు కూరగాయల వితరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: తుపాన్ నేపధ్యంలో నింద్ర మండలం, చవరంభకం పంచాయతీ, తిప్పాపురం ఎస్టి కాలనీలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు జిల్లా తెలుగుయువత నాయకుడు అగరం రమేష్, పాదిరి యువ నాయకుడు నందల ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశులు నాయుడు, పాల్ దినకర్, మహేష్ ధనుష్, మేళంభాకం సర్పంచ్ రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలను మరువద్దు

ప్రజాశక్తి - నాయుడుపేట: ప్రజల కోసం ప్రాణాలర్పించిన పోలీస్ అమర వీరుల త్యాగాలను గుర్తించుకొని, గురువారం పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించే రక్తదాన శిబిరంలో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొని రక్తదాన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయుడుపేట అర్బన్ సీఐ ఎం.బాబీ ప్రజలకు పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలలో గురువారం ఉదయం 8:30 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రమాదంలో ఉన్న వారి ప్రాణాలు రక్షించడం తమ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. సేవే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్న పోలీసుల త్యాగాలను ప్రతి ఒక్కరు గుర్తించి రక్తదాన శిబిరంలో పాల్గొనాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గిరిజన కుటుంబాలకు ఆహార పొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి - చిల్లకూరు: తిరుపతి జిల్లా, చిల్లకూరు మండల పరిధి, తమినపట్నంలో తుపాన్ కారణంగా పునరావాస కేంద్రలో ఉన్న 500 మంది గిరిజన కుటుంబాలకు జిందాల్ పవర్ లిమిటెడ్ కంపెనీ యాజమాన్యం రెండు రోజుల పాటు ఆహార పొట్లాలు అందజేశారు. పరిసర గ్రామాల గిరిజన కుటుంబాలకు కూడా ఆహార పొట్లాలు అందించినట్లు జిందాల్ కంపెనీ ప్రతినిధి విల్సన్ తెలిపారు.

స్వర్ణముఖి బ్రిడ్జిపై వరద నీటి పరిశీలన

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి సాయిప్రసాద్ బాలిరెడ్డిపాలెం – గంగనపాలెం మధ్యన ఉన్న స్వర్ణముఖి నది బ్రిడ్జిపై ప్రవహిస్తున్న వరద నీటిని పరిశీలించారు. తుపాను కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో స్వర్ణముఖి నది వరద తాకిడికి గుర్రై గంగన్నపాలెం, బాలిరెడ్డిపాలెం గ్రామాల మధ్య ఉన్న స్వర్ణముఖి బ్రిడ్జ్‌పై రాకపోకలు స్తంభించాయి. ఎంపీడీవో ప్రస్తుతం ఉన్న పరిస్థితిని పరిశీలించి, బ్రిడ్జ్ వైపు ఎవరు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత పంచాయతీ కార్యదర్శికి తెలియజేశారు. ప్రమాద హెచ్చరిక సూచికను ఏర్పాటు చేయాలని సూచించారు. వరద తగ్గుముఖం పట్టే వరకు కానిస్టేబుల్‌ని గస్తీ పెట్టాలని మండల సబ్ ఇన్స్పెక్టర్‌ను ఆదేశించారు.

సమాజహితం రెడ్ క్రాస్ లక్ష్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సమాజహితమే లక్ష్యంగా రెడ్ క్రాస్ సొసైటీ పనిచేస్తుందని ఆ సంస్థ తిరుపతి జిల్లా వైస్ ప్రెసిడెంట్ గుడ్లూరు మయూర్ తెలిపారు. బుధవారం తిరుపతి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ చేతుల మీదుగా రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్‌గా నియామక పత్రాన్ని అందుకున్నారు. త్వరలోనే రెడ్ క్రాస్ సొసైటీ సర్వసభ్య సమావే శాలు ఏర్పాటు చేసి భవిష్యత్తు సామాజిక సేవా కార్య క్రమాల కార్యచరణ రూ పొందిస్తామని మయూర్ తెలిపారు. ఆపన్నులను ఆదుకోవడంలో రెడ్ క్రాస్ సొసైటీతో పాటు ఎంజీఎం సంస్థలు ఎల్లప్పుడూ ముందుంటాయని హామీ ఇచ్చారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ దగ్గుమాటి శ్రీహరి రావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ఒప్పందం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : చెన్నైకి చెందిన ప్రముఖ పరిశ్రమ డెల్ఫీ టివియస్, పిల్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మధ్య పరిశ్రమ–విద్యాసంస్థల పరస్పర సహకారాన్ని బలోపేతం చేయడానికి అవగాహనా ఒప్పందం కుదిరింది. ఈ కార్యక్రమానికి డెల్ఫీ టివియస్ సంస్థ డిప్యూటీ జనరల్ మేనేజర్ నాగ రాజన్, వారి బృందం హాజరయ్యారు.

క్రైం న్యూస్

గరుడవారధిపై ప్రమాదం.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: గరుడ వారధిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు తిరుచానూరు–కపిలతీర్థం మార్గంలోని గరుడ వారధిపై తిరుచానూరు నుంచి తిరుపతికి, పాపానాయుడుపేటకు చెందిన రమేష్ ద్విచక్రం వాహనంపై వెళుతున్నాడు. లక్ష్మీపురం సర్కిల్ వద్ద మలుపు తిప్పబోయి అదుపుతప్పి డివైడర్‌ని ఢీకొన్నాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయమై రక్తస్రావం కావడంతో అతను అక్కడికి అక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ఇద్దరు యువకులు గరుడ వారధి పైనుంచి బైక్ ప్రమాదంలో కిందపడి మృతి చెందిన విషయం విదితమే. ఇక్కడ పదే పదే ప్రమాదాలు జరగకుండా, సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



మృతి చెందిన రమేష్

సొసైటీ అధ్యక్షుడిపై అట్రాసిటీ కేసు నమోదు

ప్రజాశక్తి - బాలాయపల్లి: మండలంలోని యాచవరం ఎస్సీ కాలనీకి చెందిన వరికూటి అన్నపూర్ణ అక్కసముద్రం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 178 లో 4.60 ఎకరాలు భూమిని ఎంతో కాలంగా సాగుచేసుకుంటున్నారు. ఆమె స్వాధీనంలో ఉన్న భూమిని వెంగమాంబపురం గ్రామానికి చెందిన యాచవరం సొసైటి అధ్యక్షులు సీసీ నాయుడు ఎక్స్‌వేటర్, డోజర్‌లతో ఆక్రమిస్తుండగా అన్నపూర్ణ తన మరిది జయరామయ్యతో కలసి అడ్డుకోవడంతో తనపై సీసీ నాయుడు దాడి చేసి కులం పేరుతో దూషించారనే ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపి తెలిపారు.

బస్సును ఢీ కొన్న కారు.. కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - చంద్రగిరి: చంద్రగిరి మండలం, రవణప్పగారిపల్లె వద్ద పూతలపట్టు, నాయుడుపేట జాతీయ రహదారిలోని బుధవారం తెల్లవారు జామున కర్ణాటక బస్సును కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు తిరుపతికి చెందిన అరుణ్ కుమార్ కారులో తిరుపతి నుంచి చిత్తూరు వైపు వెళ్ళుతుండగా, బెంగుళూరు మంచి తిరుపతికి వస్తున్న బస్సును రవణప్పగారిపల్లె వద్ద రాంగ్ రూట్లో వెళ్ళి ఢీ కొట్టాడు. ఈప్రమాదంలో కారు ముందు భాగం దెబ్బతినింది. కారు డ్రైవర్ అరుణ్ కుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని డిబిఆర్ హాస్పిటల్ రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు హోటల్లో యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు తిరుచానూరుకు చెందిన దాక్షాయిని (30) బుధవారం ఉదయం హోటల్లో ఓ రూమును అద్దెకి తీసుకొని, ఇంజన్ ఆయిల్ పోసుకుని నిప్పంటించుకుంది. విషయం తెలుసుకున్న హోటల్ యాజమాన్యం ఈస్ట్ పోలీసులకు సమాచారం. ఎనభై శాతం దేహం కాలిపోవడంతో చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సాయంత్రం 6 గంటల ప్రాంతంలో మృతి చెందింది. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం రుయా మార్చురీకి తరలించారు. యువతికి వివాహం కాలేదన్న బాధతో ఆత్మహత్యకు ప్రధాన కారణంగా పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఉచిత వైద్య శిబిరం



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నారాయణ మండలం, వెలుతురు కండ్రిగలో వర్షాల నేపథ్యంలో రిహాబిలిటేషన్ సెంటర్‌ను డాక్టర్ దర్శిత్ రాజు, మెడికల్ ఆఫీసర్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసి చికిత్స అందించారు. వర్షాలతో వచ్చే రుగ్మతల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమలు కొట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలియజేశారు.